క్లుప్తంగా

కొనసాగుతున్న నిరాహార దీక్ష



అయిజ: మండలంలోని మేడికొండను మండలంగా ప్రకటించాలని కోరుతూ గ్రామస్తులు చేపట్టిన నిరాహార దీక్ష రెండోరోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. మేడికొండ అన్ని గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉందన్నారు. గ్రామంలో అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. రవాణా పరంగా అన్ని గ్రామాలకు అనువుగా ఉందని పేర్కొన్నారు. మండలంగా ప్రకటించేంత వరకు నిరాహార దీక్షలు చేపడుతామని, భవిష్యత్తులో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం

ధరూరు: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని ర్యాలంపాడులో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. అనంతరం ర్యాలంపాడు పునరావాస కేంద్రం వద్ద ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ నజీమున్నీసా బేగం, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, జెడ్పీటీసీ పద్మ‌లు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో ఎండలు



ఉండవెల్లి: రోజురోజుకు ఎండ తీవ్రత అధికమవుతోంది. ఉదయం 8 గంటల నుంచే ఎండ దంచికొడుతోంది. మంగళవారం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో వడగాల్పులకు జనాలు బయటకు వచ్చేందుకు వెనకడుగువేస్తున్నారు. ఎప్పుడు ప్రజలతో కిటకిటలాడే రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఎండాకాలం సెలవుల సందర్భంగా విద్యార్థులు సమీపంలోని బావుల వద్ద ఈత కొడుతూ సందడి చేశారు.

ఘనంగా సవరమ్మ జాతర



అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవరమ్మ దేవత జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఆలయంలోని మూల విరాట్‌కు పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. కుల, మతాలకు అతీతంగా గ్రామ దేవతగా పూజలందుకుంటున్న సవరమ్మ దేవతకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారికి కోళ్లు, కొబ్బరికాయలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వస్తున్న భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా నీటి వసతితో పాటు అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకోనే అవకాశం కల్పించామని నిర్వాహకులు వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యారెడ్డి, అరేందర్‌రెడ్డి తెలిపారు.

ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం విఫలం



గద్వాల: ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులు నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభం కాకముందే రకరకాల ఫీజుల పేరుతో యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నాయని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం బీజేవైఎం నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది విద్యా సంస్థలు ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాధికారులు ప్రైవేటు విద్యా సంస్థలపై దృష్టి సారించాలన్నారు. అధిక ఫీజుల నియంత్రణతో పాటు అకాడమిక్ పుస్తకాలు, యూనిఫాం, తదితర వాటి పేరిట చేసే దోపిడీని అరికట్టాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేటు విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అధిక ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామంజీ, హరిప్రసాద్, కృష్ణ, ప్రవీణ్, మోహన్, శ్యామ్, రాజు, పాండు, రంజిత్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



ధరూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



మల్దకల్‌లో..

ధరూరు: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ - 2023 మండల స్థాయి క్రీడా పోటీలను కన్జ్యూమర్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, గ్రంథాలయ జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, ఎంపీపీ నజీమున్నీసా బేగం, జెడ్పీటీసీ పద్మమ్మ, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ దౌలన్న, పార్టీ మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్ కుమార్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం..

ఎర్రవల్లిచౌరస్తా: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ నిర్వహిస్తునట్లు ఎంపీపీ స్నేహా అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సీఎం కప్ క్రీడా సంబరాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరై క్రీడాపోటీలు ప్రారంభించి మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హనుమంత్‌రెడ్డి, ఎంపీడీఓ రాఘవ, ఎస్ఐ గోకారి, వైద్యాధికారి మాధురి, బీసన్న, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు ఉన్నారు.

రాజోళి: మండల కేంద్రంలోని కొత్త రాజోళిలో సీఎం కప్ క్రీడాపోటీలను జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్ హాజరై ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆటల్లో ప్రావీణ్యం ఉన్న క్రీడాకారులకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాల్, ఎంవీ ఫౌండేషన్ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పీఈటీలు, అధికారులు పాల్గొన్నారు.

గట్టు: గ్రామీణ స్థాయిలో ప్రతిభ కల్గిన క్రీడాకారులను గుర్తించేందుకు సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలను జెడ్పీటీసీ బాసు శ్యామల, తహసీల్దార్ జుబేర్ అహ్మద్, ఎస్ఐ పవన్ కుమార్, సర్పంచు ధనలక్ష్మిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసిందని కొనియాడారు. ఎంపీడీఓ చెన్నయ్య, ఎంపీఓ మహేష్, ఎంఈఓ కొండారెడ్డి కార్యదర్శులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో రోజు మంగళవారం సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీడీఓ కృష్ణయ్య, ఎస్ఐ శేఖర్ ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ కొండారెడ్డి, పీఈటీలు వెంకట్రాములు, సుభాషిణి, తిరుమల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలస్థాయి క్రీడా పోటీలను ఎంపీడీఓ రమణరావు, డిప్యూటీ తహసీల్దార్ ధరిణిషా ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ తదితర క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మంచి ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీటీ శ్రీనివాసులు, అధికారులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

అయిజ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ సాయిప్రకాష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు.

ఉండవెల్లి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీపీ బీసమ్మ అన్నారు. మంగళవారం జెడ్పీహెచ్ఎస్‌లో సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, వైస్ ఎంపీపీ దేవన్న, ఎంపీటీసీలు సుంకన్న, రాజశేఖర్, పీడీ భరత్ కుమార్, పీఈటీలు, సీనియర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, పాల్గొన్నారు.



ఉండవెల్లిలో..



అయిజలో..



ఇటిక్యాల మండలంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ



మానవపాడులో..



గట్టులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ

ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్‌ను కలిసిన ఎమ్మెల్యే



ఇరిగేషన్ అధికారిని కలిసిన ఎమ్మెల్యే అబ్రహం

ఉండవెల్లి: హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ రఘునాథ్ రావును ఎమ్మెల్యే అబ్రహం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అలంపూర్ మండలంలోని లింగన్‌వాయి లిఫ్ట్ కోసం 6 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలని విన్నవించారు. ఈ మేరకు అధికారి సానుకూలంగా స్పందిస్తూ రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ రాముడు, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు అజయ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



మల్దకల్‌లో సమ్మె చేస్తున్న వీఓఏలు

మల్దకల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు చేపట్టిన సమ్మె 30 రోజు మంగళవారం కొనసాగింది. మండలకేంద్రంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో మండల నాయకులు బాషా, చంద్రాములు మాట్లాడుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి రూ.10 లక్షల ప్రమాద బీమా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో శంకర్‌గౌడ్, ఆంజనేయులు, గోవిందు, హనుమంతు, కృష్ణ, వెంకట్రాములు, అపర్ణ, నవీన, ఎస్తేర్, తిరుమలేష్, జనార్దన్, తిమ్మప్ప పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య ఎదుట నిర్వహిస్తున్న వీఓఏల నిరవధిక సమ్మె కొనసాగింది. ఈసందర్భంగా వీఓఏలు నిరసన తెలిపారు. వీఓఏలకు గుర్తింపు కార్డులను జారీ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు సురేష్, వీరేష్‌గౌడ్, మహాదేవ్‌గౌడ్, నాగరాజు, భాస్కర్, తిరుమలేష్, ప్రకాష్, మునేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



గట్టులో ఆందోళన చేస్తున్న వీఓఏలు

మిల్లర్ల దోపిడీ నుంచి రైతులను కాపాడాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, బీజేపీ, రైతాంగసమితి నాయకులు

గద్వాల రూరల్: ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అకాల వర్షాలకు దెబ్బతిని రైతులు కుదేలైతే మరోవైపు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మిల్లర్లు క్వింటాల్‌కు 8కిలోల చొప్పున తరుగు తీసుకుంటూ రైతులను నిలువునా ముంచేస్తున్నారని బీజేపీ, రైతాంగ సమితి నాయకులు అన్నారు. ఈమేరకు వారు రైతులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ప్రభుత్వం తరుగులేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెబుతుంటే మరోవైపు మిల్లర్లు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేవలం స్వలాభమే ధ్యేయంగా రైతులను నిట్టనిలువున లూటీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గోడును నేరుగా కలెక్టర్ వినాలని కలెక్టర్ బయటకు రావాలంటూ నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కలెక్టరేట్ ఏఓ యాదగిరి బయటకు వచ్చి రైతులతో మాట్లాడారు. రైతులు ఇచ్చిన వినతిపత్రాన్ని తీసుకుని న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడ్డం కృష్ణారెడ్డి, మిర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, రైతాంగ సమితి నేతలు గోపాల్, ఖాజామొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల



తరగతి గదిలో మద్యం సీసా ముక్కలు

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల ప్రాథమిక పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. వేసవిసెలవుల దృష్ట్యా పాఠశాలకు ఎవరు రాకపోవడంతో ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగి సీసాలను గదుల్లోకి విసురుతున్నారు. దీంతో సీస ముక్కలు గదినిండా పరుచుకున్నాయి. పాఠశాల ఆవరణలో తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న సేవాదళం సభ్యులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పెద్ద దిన్నె గ్రామానికి చెందిన సంతోషమ్మ మనవరాలు షాలిని ఇటీవల విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు మంగళవారం గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోతురాజు సోమనాద్రి సూచన మేరకు సేవాదళం సభ్యులు మృతురాలి కుటుంబ సభ్యులకు రూ. 5000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు దేవన్న, శేఖర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: పట్టణంలోని ఆరో వార్డులోని బీసీ కాలనీలో నివాసముంటున్న కృష్ణయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. వారి ఆర్థిక పరిస్థితులు బాగోలేవని తెలుసుకున్న మాజీ వార్డుసభ్యుడు గడ్డమీది శ్రీనివాసులు అంతక్రియల నిమిత్తం రూ. 5 వేలు ఆర్థికసాయం కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు బుచ్చన్న, శ్రీను, రవి, సవరన్న, కమామాల్, అంజి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

కేటీదొడ్డి: మండలంలోని పాగుంట గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 209లో మొత్తం విస్తీర్ణం 10–20 గంటల గల భూమిని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సుందర్‌రాజు, ఆర్ఐ ఉదయ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అనువైన స్థలం గుర్తిస్తున్నామన్నారు. ఈ భూమికి సంబంధించిన వివరాలను త్వరలో కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని తహసీల్దార్ తెలిపారు. అనంతరం రెండో రోజు కంటివెలుగు కార్యక్రమాన్ని సందర్శించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలోని రేషన్‌దుకాణాన్ని సందర్శించి బయోమెట్రిక్ మిషన్‌ను తనిఖీ చేశారు. వారి వెంట నవీన్‌కుమార్, డీలర్ భీంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పాగుంటలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్

ఈజీఎస్ పనుల పరిశీలన



ఈజీఎస్ పనులు పరిశీలిస్తున్న ఏపీఓ శరత్ బాబు

అయిజ: మండలంలోని గుడుదొడ్డి శివారులో నిర్వహిస్తున్న ఈజీఎస్ పనులను మంగళవారం ఏపీఓ శరత్ బాబు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ఉదయం 8 గంటలలోపు పని పనిచేసే ప్రదేశానికి చేరుకోవాలని త్వరగా పనులు ముగించుకోవాలన్నారు. ఎక్కువ పని చేస్తేనే ఎక్కువ కూలి వస్తుందని, పని చేసిన కూలీలందరికి కొలతల ప్రకారం కూలి చెల్లిస్తామని అన్నారు. నిబంధనల మేరకు పనులు చేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు.

శాంతినగర్: ఉపాధిహామీ పథకంలో భాగంగా కొంకల గ్రామ సమీపంలోని ఆర్డీఎస్ ప్రధాన కాలువలో చేపడుతున్న పూడికతీత పనులను ఎంపీడీఓ రవీంద్ర మంగళవారం పరిశీలించారు. కొలతల ప్రకారం పనిచేస్తే సరైన కూలి దక్కుతుందన్నారు. ఎండ తీవ్రత పెరగకముందే పనిముగించుకొని ఇంటికి వెళ్లాలని కూలీలకు సూచించారు. ఎంపీడీఓ వెంట ఎంపీఓ తిరుపతన్న, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న సీడీపీఓ కమలాదేవి

మల్దకల్: విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని సీడీపీఓ కమలాదేవి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో గట్టు, అయిజ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకే సెంటర్లను నిర్వహించాలన్నారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఐసీడీఎస్ ద్వారా అమలవుతున్న అన్ని సేవల గురించి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరాణి, వాసంతి, తెల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు

వివాద భూములపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగేష్

రాజోళి: మండలంలోని ముండ్లదిన్నెలో వివాదంలో ఉన్న ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంగళవారం తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మకు ఎస్ఎంసీ చైర్మన్ పెద్దింటి నాగేష్ వినతి పత్రం ఇచ్చాడు. గ్రామంలోని సర్వే నెంబర్ 143, 147, 04 లలో ఉన్న ప్రభుత్వ భూములు గతంలో కొంత కబ్జాకు గురయ్యాయని మిగిలిన భూములు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన కారణంగా కొంతమేర కబ్జాలు తగ్గాయన్నారు. ప్రస్తుతం కబ్జాదారులు ప్రభుత్వ జీఓలను అడ్డుపెట్టుకొని తిరిగి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని వివరించారు. దీనిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టి వాటి ఆక్రమణకు గురి కాకుండా చూడాలని కోరారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

మల్దకల్: మండల కేంద్రంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం డెంగీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి ర్యాలీ ప్రారంభంకాగా గ్రామంలో పలు వీధులలో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వరూపరాణి మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీధర్, సత్యమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మల్దకల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



జల్లాపురంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మానవపాడు: నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఏఓ సుబ్బారెడ్డి, ఎస్ఐ సంతోష్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని జల్లాపురంలో ఫర్టిలైజర్ దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. మందులను కొనుగోలు చేసిన రైతులకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. దుకాణాల ఎదుట ధరల పట్టిక ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టు ఎరువు తయారీపై అవగాహన



ఉపాధి కూలీలతో డీఆర్‌డీఓ ఉమాదేవి

మల్దకల్: ఉపాధి హామీ కూలీలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఓ ఉమాదేవి అన్నారు. మంగళవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి కూలీలకు గ్రామాణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వర్మీ కంపోస్టు ఎరువు తయారీ, పాల వ్యాపార ఉత్పత్తులపై నిర్వహించిన ఉచిత శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి డీఆర్‌డీఓ ఉమాదేవి, ఎస్‌బీఐ బ్యాంకు రీజినల్ డైరెక్టర్ ప్రసాద్‌లు హాజరై మాట్లాడారు. కూలీలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎరువు తయారీ, పాల వ్యాపార ఉత్పత్తులపై అవగాహన కల్పించామన్నారు. అనంతరం శిక్షణకు హాజరైన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఏపీఓ స్వామి, మహేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.